# పెల్లి

**క**నకయ్య పెద్దకూతురు బూసమ్మ పెల్లి ఆరేత్తిరికి. మూర్తం సానా పొద్దు పోయినాకయింది. సుట్టాల్జనంతో కిటకిట లాడ్తుంది పెల్లి పెదేశమంతా. సీకటెక్కువవుతున్న కొద్దీ ఏపనినా తెరిపిన పడక కనకయ్యా, పెల్లాం పార్వతమ్మా, కాత్తె ఆరీర్ని బతిమలాడుకుంటా పన్లు తొందరగా కావాలంటా, ఆ గుంపున గలిబిలిగా తిరుగుతా ముక్కుకు సీదరబట్టి ఈయనా, గొంతు బొంగురుబోయి బరకనబడ్తా, దరబరమంటా ఆయిడా, సొంతపనికి మల్లెనే సాయపడ్తా ఎడాపెడా, ఆడా మగా తెలవకుండా కల్తీనబడ్తా, బతిమాలించుకుండ పనిమంతులూ, ఎవురిమాటారికి అరదం కాకండా గుంపుమయాన గెడ్డొచ్చిపడ్డ కాకుల కీసరబాసరకు మల్లే "ఈ గంగాలా లాడబెట్టు. ఆ సాప లందుకో. సన్నాయి కర్రోళ్ళ సంగతోరికి పట్టదేం? సూడండి పెల్లికూతు రేడుందో? మొదులీ కనకయ్య కాన్రాడేం?" అంటా పని మంతులు సుతులెట్టి సీనారేకులు పెల పెల్లాడిత్తా నూర్పిడి సేతుండారు పెల్లి పెదేశమంతా.

ఆ సందట్లో పిల్లసంచుకు ఎంత సెర్రేగటానికి ఈలుండా, కనకయ్య తమ్ముడు బుగ్గమీసాల రత్తయ్య, ఈ సంత నోకంటకనిపెడ్తా, ఆ అందిన సెవినీ, ఈ ఈలగావుండ ఈపునూ సవరదీత్తా ఆడీడా మసలటంతో, కాత్తె పనిజనానికి పైగావుంటూ ఒచ్చారు కుర్రకారు.

కనకయ్య సిన్న కూతురు నాగరత్తీ, సాకున పెరిగిన మేనల్లుడు కాంతం! ఇంత సందట్లోనూ, అనుకుండ పెకారం సేహితంగ జోడు సీలకండా, సొంతింటి సందరబ మవటంలో, రత్తయ్య పోకడ గమనిత్తానే గంగాలా వాయిత్తుండారు సాటు సాట్న. ఓ రవిలుబం డాటేనా, గుర్రపుసారీయేనా, కొబ్బరాకుల టుపాస్కులేనా, ఆతప్పెట్లజోలి దేనికో! ఆళ్ళు కాత్తాసూసి, తాటొలుత్తామంటా – ఓ గెంతులేనా, ఓతంబాలాటేనా, ఆడ్తా ఆడ్తా, "యాక్" మని పేరంటాల ఎంకటసుబ్బమ్మ మీన యిరుసుకు పడ్డాడు కాంతం. సేతిలో వుండ పొసుపు పల్లేన్ని ఆయిడ, తనమీనా సిందకొట్టుకుంటా, "మాయదారి సచ్చినోడ! యాడ దాపరించావురా మిడత లాగ!" – ఇంకా సుబ్బమ్మ సగమన్నా యిప్పందే, యాణ్ణించి ఒచ్చిందో, ఫెటీమని కాంతం ఈపుమీన పడ్డది రత్తయ్య సెయ్యి – ఒల్లు సలపరించి,

అవ్వాయి సువ్వకుమల్లే ఒకటేదూకు దూకాడు, సుండోల్ల కుక్కలాగ యాడ మరుగుంటే ఆడకి.

ఈపు సురసురమంటుండా, తెలవక తను దూకిన దూకుడుకు, సుబ్బమ్మ గేదపడ్డకుమల్లె బెదిరిసేసిన యటకారానికి, నవ్వుకు రొప్పుతుండ పొట్ట తట్టుకో లేక పోయింది కాంతానికి, ఈపు రుద్దుకుంటుండా.

తఫీమని పిడత పగిల్నట్టు జరిగిన ఈ యవారమంతా, తంబంసాటుకు సేరి సూత్తుండ రత్తి, కాంతం ఎటు లగెత్తిందీ తెలవక, పిల్లికూనల్లె సీకట్లో తవుల్లాడ్తా, గొడ్డసావిడి మొత్తకాడి కొచ్చేతలికి – మరింత పగలబడ్డాడు రత్తిని సూసి కాంతం. తనూ నవ్వాపుకోలేక, దబుక్కున నోటికి సెయ్యడ్డం పెట్టుకుని "వుప్ వుప్" అంటా, పొర్లాడుతా ఇరగబడ్డది, కాంతంతో పాటు రత్తి కూడా.

"అదేందిరా – యిహ్, యిహ్, యిహ్ – సుబ్బమ్మ మీన – యిహ్ – అత్తా ఇరుసుకు పడ్డావూ? యిహ్హీ – "

"హి, హి, హి, బలే, హి, హి, పొసుపంతా నెత్తిన బోసుకుని – యిక్ – ఒకా టాడింది సూసుకో! యిక్ – "

"రత్తయబాబాయి రాటం నే సూత్తునేవుండా–ఇవ్–ఇవ్–ఈపుమీన–టట్–ట–టపాకాయ–" మల్లీ పగలపడ్డది రత్తినోటికి సెయి సాటు సేసుకుని.

కాంతానికి ఒకపాలి ఇప్పుడుగా దెబ్బసురుకు సురసుర మరింత పైకి లెగిసింది. రత్తి యిందాకటాల్నుంచి ఆ పగలబట్టం తను తిన్న దెబ్బకని తెలుసుకున్నాక బిగుసుకు పొయ్యాడు, బాధ మరికాత్తెక్కువై.

"ఎంతుకమ్మా అంత నవ్వు? నాకేం తగల్లా దెబ్బ."

"వూహో, హొ, హొ – వుత్తి మీద దుత్త పగిల్నత్తు పలుగుతె – ఇంకా – యిహి – యిహి"

"ఎంతుకమ్మా అత్తా పడి కొత్తుకుంతావూ? పాపం కల్లుసల్లగా వుండై కాం వల్ను?"

"అది కాదురా, కీసుపిత్తాలె అత్తా లగెత్తుతే–యిహి–వుప్–"

"నీకు కాలా శాత్తి? ఆనాడు సాతుగా వులవగుగ్గీలు బొక్కుతుంతే–మాంవ సూసి–సెవులు పిందుతుంతే–కీసు కీసు మంతా ఎగిర్తివే లబ్బరి బొమ్మాలే! ఆ తిమ్మరి తిమ్మరి ఏకాడికి వదలకపాయనే!"

"వొప్పుడమ్మా?"

"ఒప్పుడా! తెలవదేం, పాపం? దూడకుమల్లే గుగ్గీలు తింతం ఏందే, ఈపాలాపడు

తోలు తీత్తా, అన్లా అప్పుడు మాఁవా?"

(మెటికిలిరుత్తా) "పానీలే, పాపం నీకడుపు సల్లపరిందిగా! పానీలే-ఈపు రుద్దుకుంటా."

"నేనేం రుద్దుకోటంలా! మొదలు నాతో తంబాలా టెందు కాదా?"

"ఆత్తే మటుకు సుబ్బమ్మ మీన పడమన్నా రెత్తా?"

"నే నేం పల్లా. పాపం సెప్పనన్నా సెప్పలా, ఆ దొత్తుండాదని సూత్తా నుంచునీ!"

"ఎత్తాగయ్యా? మొదులు - యిహ్హా-"

"యిక్ యిక్ మంతా ఎందుకత్తా పడిసత్తావూ? వుండు సెప్తా నీ పని! ఈపాలి రమ్మనవూ? 'దారా ఆరుకుందాం' అని కోతల్లే! అప్పుడు! నా దెగ్గిర సెక్కిరాలుండై నీకు పెత్తన్లే!"

"యాడియిరా! ఎవు రిచ్చార్రా? - పానీలే."

"పానీగాక రమ్మన్నా రమ్మాయిగార్ని, కిసకిసమంతా యికిలిత్తా?"

"పానీలేరా. ఎవురిచ్చార్రా సెప్పమంతేనూ! ఈపాలి నవ్వనుగా పానీలె, నా కెవురూ పెత్తరు."

"అబ్బో! ఏం నంగనాసివే! నువు నా కెప్పురైనా పెత్తా?"

"పెత్తలేదయ్యా? వుండు నే బూరి తెచ్చుకుని నీ కింతన్నా పెత్తానేమో సూడు!"

"ఆఁ.. యిత్తారు పో గెరిటి తీసుకుని."

"ఫా ఆతలికి! సూడమ్మా ఎత్తా ఒత్తున్నాడో యనకమాలె! అయ్యో సక్కదనం!"

"కామత్తే ఒత్తుండా."

"ఎవురు పెత్తర్లే ఆసి పర్తుండావు గాని!"

"చెరిచొగం."

"ఏందీ?"

"కాత్తె, కాత్తె"

"అనుకుంతుండు, నాకేం?"

"సక్కదనం-"

"ఆఁ-"

"నార్తి - అయ్యో -"

తవుల్లాడుకునేతలికి ఎటు లగెత్తిందో, బాగా గిచ్చి - 'సిలిపిముండ, అనుగుద్ది రానీ!"

పెళ్ళి పందిట్లో అడావుడి ఎక్కువైపోతుండది. ఆ సుట్టాల జనం అటూ యిటూ తిరుగాడ్తుంటే, సన్నాయి కఱ్రాయిన, 'సూడు పిన్నమ్మా' పాట మా లయగా ఇసుర్తుండాడు. ఏలుముడి డోలాయిన వుసారిత్తుంటె. బాకా లూదే ఆయిన పార్వతమ్మ గరగరమంటా ఆ పద్దప్పుడల్లా, మడిసికి వూపిరి పోతున్నట్టు, గొట్టం ఆ ఏపులకు బారుసేసి, గీంకారం పెట్టిత్తుండాడు పోలీసాడి తుపాకిమల్లె వుండ ఆ పొడుగాంటి బాకాతో. పెళ్లోరు తరలిరాను కాత్తె పొద్దుపోయినప్పటికి సంటిపిల్లకు పక్కలు ఆడీడ యింకా సరదకుండానే జరిగిపోతుంటమే కాకుండా, పెళ్లి పెదేశాన్నంతా కలకల్లాడిత్తా గేసునైటు దీపాలముంగల రంగురంగు శాపలాలె తిరుగాడుతుండారు పెల్లికొచ్చిన ఆరీరు.

బుగ్గ మీసాల రత్తయ్య పై పెత్తందారీ సేసినంతమటుకుసేసి, అప్పుడే కాత్తెసెయి తెరిపి సేసుక, 'యిస్' మనుకుంటా అట్టా ఓ మూలగా పందిరి తంబం కింద ముడ్డానించాడో లేదో – రత్తి ఎటుపోయిందాని మూలగా వుండ ఆ తంబాన్నే ఎక్కి సూత్తుండ కాంతం, రత్తయ్య తంబంకాడికి రాటంసూసి ఒనుకుపుట్టి కల్లు తిరిగి జఱ్రున జారి తఫీమని, ఎత్తి పేడతట్ట బోర్లించినట్టు, రత్తయ్యమీన కువ్వ కువ్వగా పడ్డాడు. యాడవో వడ్డబత్తాలు జారి నెత్తిన పడ్తున్నట్టయ్, అంత మడిసి ఆవజాన దిమ్మరబోయి, కాత్తె తెప్పరిల్లి ఒల్లు దులుపుకుంటా ఎగిరిపడి సూసేతలికి వడ్డబత్తాలేడ కానరకాపోంగా, వూదే సన్నాయి కఱ్రాయినకు ఎక్కిల్లు పుట్టటం అట్టావుంచి, దారెబోయ్యే పేరంటా లెంకటసుబ్బమ్మ, కాలీ కిర్సనాయిల డబ్బాలబండి బోల్తాకొట్టినట్టు నవ్వులపెల్ల లూడ్తుంటే, కండవా దులుపుకుని సీదరించుకుంటా, 'తొందెదవ. ఆదే! సావగొడ్తును అందినట్టయితే' అనుకుంటా యవారం తోసేసుకు పొయ్యాడు రత్తయ్య ఆతల పనున్నట్టు.

కాంతాన్ని గిచ్చి లగెత్తికెల్లి రత్తికూసేపు అటిటు తారాడి అమ్మ నాయన సాయిలకు పోకుండా, ఓ మూలగదిలో కూసుండ పెల్లికూతురు బూసమ్మక్క కాడకు సల్లగా సేరింది, యిడిసేనిన పిల్లికూనకు మల్లే.

"యిదేం పెల్లమ్మా! ఏ కాడికి తెవఁలకుండా!" అని సనుగుతుండది – బూసమ్మ ఒంటరిగా సిరాకు పడ్తా.

"అక్కక్కా, ఏఁవన్నా తింతానికి పెత్తవే?" అంది రత్తి ముద్దులు కుడుత్తా.

"యిదేం పిల్లమ్మా దీని కెప్పుడు నోటి దూలేను! ఓ పక్క పెల్లేందని గాబరాపుట్టి సత్తంతేను!"

"మరెంతుకమ్మా సేసుకోతం?"

"పాయే, నీదంతా ఓ పిల్ల సొద! గాబరాగా వుండ దెట్టా మరీ?"

"ఎంతుకమ్మా గాబరా?"

"పా ఆతలికి, యిసారించచ్చావుగాని, మొదులే బయంగా ఉందినాకు."

"ఎంతుకమ్మా అంత బయం? నా మొగుడయ్య బాగుంతాడని సెప్పు కుంతింతివే అందర్తో?"

"నాసంగ తెరగవురత్తోయ్? ఫో. ఎల్లి ఆ కోతి కాంతాయికాడ కూసో."

"నీ మొగుడే కోతి. నన్నంటే అసలు పణ్ణునేను–"

"ఓలమ్మో! దీని కెంతబిమానంవే! యిగముందు మమ్మల్ని బతకనిచ్చుద్దా? ఎంతెన కేసుకు రాటం!"

"సాల్లే బుత్తబొమ్మాలె సింగారించుకున్నావుగాని అవుద్దిలే పెల్లి"

"రత్తోయ్, నా సంగతెరగవ్, పా ఆతలికి."

"నాకు బూరి పెత్తు!"

"నే నీదేం కువ్వేసుక్కూసోలా బూరిలు, అమ్మసూత్తే సంపుద్ది."

"ఆఁ, యాడో వుండై, నాకు పెత్తూ!"

"అన్నీ యిప్పుడే కాజేత్తుండాంవని నరకరూ తెలుత్తే!"

"ఎత్తా తెలుసుద్దమ్మా, నే ఎవుర్తో సెప్పనుగాని అసలే దమ్మా వుందీ?"

"ఈడే వున్నాయ్‌గాని, ఎవిర్తోన్నా సెప్పావా, సీలుత్తా"

"యీడ పెత్తుకుని అన్నీ తింతూ కూసున్నా, యింకా బయం దేనికమ్మా? నాకు ఓతి, రెండు, అన్ని పెత్తు"

"అరవమాఁకే! సీలుత్తా."

"ఇంకోతి– ఆ ఒక్కతి సాలే!"

"నువ్వేడ దాపరించావే, కప్పలాగ! యాడన్నా సాటున తిను. సంపుతా తెలిసిందంటే."

బూర్లను పరికినీసివర్న బద్రంగా సుట్టి, పైకిలాగి బొడ్డోదోపుకుని, వోనీ పైకిలాగి, మొగం గాబంతై బయటపడ్డది రత్తి ఒళ్ళు కులికించుకుంటా.

"ఈన అవుపించాడా, ఈ నవుపించాడా" అంటూ కనకయ్య కోసం, వంటిల్లంతా దేవులాడి గొంతున రవ్వబలుకుతా ఒత్తుండ పార్వతమ్మ, రత్తి ఆత్రపెవారం సూసి, "ఓసి నీయిల్లు నేలగట్టా! యీ సాయిల్ని దేనికే తిరుగుతుండావూ? ఆ కాంతాయి ఏడీ? ఆ రత్తయ్య మరిదిమీన పందిరి తంబం మీన్నుండి దూకాడంట! పందిరిమీన వాడికేం పనొచ్చిందో! యిదేం పిల్లలు! పెల్లోరొచ్చి 'ఈ పిల్లలేందీ ఈ యవారమేందీ' అంటా నవ్విపోరూ? మొదులీయన కాన్రాందే! యాడ సుట్ట కాలుత్తూవుండ మడిసికి ఆడనే సరిపోతుండె! బానే వుందీ యవారం. ఈడేం చేత్తూండావే నువ్వా? ఆ పరికినీ పైకి

దోపుకోటం ఏందీ! ఆకల్లకాటికేందీ? ఏందీ అవతారం? ఏదీ యిట్రా, కొత్తపరికినీ అట్టా పాడుచేత్తుండావు-ఆతల పనుంటే-"

"వత్తానుండే! కాల్లకడ్డం పత్తుంతే పైకి దోపుకున్నా! వత్తాలేనూ పా."

"ఏం అడ్డం పడదు వూడదియ్యి ముందు. అసియ్యంగా ఓరన్నా సూత్తే ఏఁవఁ నుకుంటారూ? తియ్యి ముందు-నువ్వా"

"తీత్తా వుండే-"

"బొడ్డో ఏఁవుందే, సేతు లాడ పెట్టుకుంటావూ? ఏది సూణ్ణీ?"

"సూపిత్తానుండే-మరే-ఒద్దన్నకొద్ది బూరిలు పెట్టిందే అది-"

"బూరిలేందీ! నీ కెవురు పెట్టారు?"

ఈ జాతరంతా తలుపుసాట్నుంచి యింటుండ పెల్లికూతురు బూసమ్మ తల బయిటికి పెట్టి గుడ్లురుఁవుతా 'సంపుతా' నని సయిగ సేసింది రత్తికి.

"అదుగోనే-సూడమ్మా సంపుతాని ఎత్తా బెదిరిత్తుండదో!"

పార్వతమ్మ అటు తల మలిపిందో లేదో, సందు దొరికిందే సాలని గొడ్ల సాయిడేపుకు లగెత్తింది రత్తి రొప్పుకుంటా.

పెల్లని పాతసాఁవా నంతా గొడ్డసాయిట్లో ఏసి గొడ్డను యింకో సోటికి తోలటంతో కాత్తె కాలీగా వుంది సావిడి.

రత్తి లోపలకు సేరి తంబంకాడ కూసేపు కూకుందాఁవని సీకట్లో తవుల్లాడ్తా-రత్తయ్యమీన కుత్తీపట్టొచ్చి, సా పోటి సంపాయించి కూసునాలోసిత్తావుండ కాంతం మీన గబాల్న పడ్డది 'కిక్' మంటా.

"పానం తీశావు కదంటె! ఎవురో అనుకుని పీసుపీసుమంది పానం!"

"నువ్వే నంతరా, కాంతం-" ఆ పడ్డ బయానికి గబాల్న కాంతాన్ని వాటేసుకుంది ఎగరొప్పుతా.

కూసేపుటికి ఓరికోరికి జరిగినవి యిద్దరూ సెప్పుకుందారు ఇంతింతగా.

"యియిగోన్రా, బూరిలు. ఇద్దురం తిందాం సక్కగా ఈడ కూసుని."

"అబ్బ! యాడియే?"

"సూశా, సూశామ్మా, అన్ని లాక్కుంతా! అంతుకునే-"

"ఇందాక గిల్లీ!"

"మరి నన్నెందుకమ్మా, సక్కందాన్నని, నార్తి ననీ అంటం? సూడమ్మా ఇంకా పాపం అనీ!"

"మరెందుకమ్మా అత్తా ఎగతాలి సేసిందీ?"

"నన్నూ అంతివిగా సరిపోలా! ఎంతుకమ్మా అంతకోపం! పానీలేరా."

"లేదు లేయే, మనం మనం ఒకతిగా."

"నువు మంచోడివిరా, కాంతం! వూఁ అవు(న్రా!"

"నువుమతుకు కాదమ్మా? యింకా నువు బాగుంతావు కూడా."

"పానీలేరా నీదంతా బడాయిగాని నువుమతుకు బాగుంద వెత్తా?"

"మా రత్తి!"

"మా కాంతం!"

"ఇంకా ఎప్పుడమ్మా బూరిలు తినేదీ?"

బూరిలు తిన్నారు. రత్తి సాయిడిపక్కనుండ దొడ్లోకెల్లి బాయికాడ సెంబుతో నీలు తెచ్చింది సాటుగా. ఆ నీలు ఇద్దరూ తాగారు.

"నే నీణ్ణే పడుకుంతా కూసేపు. లేకుంతే రత్తయమాఁవ సంపుతాడు" అన్నాడు కాంతం.

"అమ్మ సంపుద్ది, నేనూ నీ కాడనే పడుకుంతా" అంది రత్తి.

"నువు మంచిదానివే, రత్తీ!" అన్నాడు కాంతం.

"పానీలేరా" అంది రత్తి.

"నార్తి" అన్నాడు కాంతం.

"నాకు కోపం వచ్చుద్ది" అంది రత్తి.

"ఇద్దరం అనుకుని పండుకుందాం" అన్నాడు కాంతం.

"పానీలేరా" అంది రత్తి.

"నార్తి –" గొనిగాడు కాంతం.

"కాం–" గొనిగింది రత్తి.

"..............."

"పానీలేరా–" మూలిగింది రత్తి.

నిదర పొయ్యారు తా మేదుంది తెలవకుండా. ఆల్లకు ఏ బాకాలు, సన్నాయికర్రలు యినపట్టల్లా. ఎప్పటికి లెగుత్తారో! కాంతం గుడ్డల్నిండా పొసుపు. రత్తి గుడ్డల్నిండా పొసుపు. నిదర పొయ్యారు.